క్లుప్తంగా

పెద్దమ్మతల్లికి ఎమ్మెల్యే పూజలు



జనగామ: పట్టణ కేంద్రంలోని 15వ వార్డులో జరుగుతున్న పెద్దమ్మ తల్లి 12వ వార్షికోత్సవ కార్యక్రమంలో గురువారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించారు.

ఇల్లు కూలి పోతోంది.. ఇందిరమ్మ స్కీం మంజూరు చేయండి



చేతులెత్తి వేడుకుంటున్న కార్మికురాలు యశోద

జనగామ: ఇల్లు కూలిపోతుంది.. ఇందిరమ్మ పథకంలో దరఖాస్తు చేసుకున్నా.. ఖాళీ ప్లాటు ఉంటేనే సొంతిళ్లు ఇస్తారట.. ప్రభుత్వం పెద్ద మనసు చేసుకుని భరోసా కల్పించాలని పట్టణంలోని 11వ వార్డు వీవర్స్ కాలనీకి చెందిన కడవేరుగు యశోద వేడుకుంటున్నారు. గురువారం మహిళ 'సాక్షి'తో మాట్లాడుతూ కిడ్నీలు పాడపోయి 9 నెలల క్రితం భర్త మార్కండేయ మృతి చెందడంతో మహిళ ఒక్కరే ఉంటున్నానని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన చేనేత బీమా రూ.5 లక్షలు ఇప్పటి వరకు అందలేదన్నారు. నేత వృత్తి చేసుకుంటేనే పూట గడిచే పరిస్థితిలో కూలీ పోయే ఇంటిని మరమ్మతు చేయించుకోలేక పోతున్నాని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తే, శిథిలావస్థలో ఉన్న పాత ఇంటిని కూల్చి నూతనంగా నిర్మాణం చేసుకుంటామని చెప్పారు. ఖాళీప్లాటు ఉంటేనే ఇల్లు మంజూరంటూ అధికారులు చెబుతున్నారని, వర్షాకాలం ప్రారంభం కావడంతో నిత్యం టెన్షన్ టెన్షన్‌గా బతుకుతున్నామన్నారు. తాను పడుతున్న బాధను అర్థం చేసుకుని మొదటి విడుత ఇందిరమ్మ జాబితాలో అవకాశం కల్పించాలని రెండు చేతులెత్తి వేడుకుంటున్నారు.

పండ్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న ప్రవీణ్‌కుమార్

బచ్చన్నపేట: స్వర్గీయ వైఎస్ రాజారెడ్డి జయంతిని మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాత రాజారెడ్డి జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, వైఎస్ జగన్ అభిమాని బొడ్డు ప్రవీణ్‌కుమార్ కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

ట్రాక్టర్–బైక్ ఢీ..

ఇరువురికి తీవ్రగాయాలు

తరిగొప్పుల: ట్రాక్టర్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. అబ్దుల్‌నాగారం గ్రామానికి చెందిన ఎదునూరి కర్ణాకర్ మార్బుల్స్, టైల్స్ వేసే పనిచేస్తుంటాడు. కాగా, గ్రామంలో ఓ ఇంటిలో టైల్స్ వేసే పనిని ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో పనికి తోడుగా ఉండేందుకు తెలిసిన మిత్రులను హైదరాబాద్ నుంచి రప్పించుకున్నాడు. బుధవారం సాయంత్రం టైల్స్ వేసే పని ముగించుకున్నాక ఎదునూరి కర్ణాకర్ మరో ఇద్దరు మిత్రులు ద్విచక్రవాహనంపై స్వంత పనుల నిమిత్తం మండలకేంద్రానికి వచ్చి తిరుగువెళ్తున్న క్రమంలో మండలకేంద్రానికి సమీపంలో ట్రాక్టర్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి.దీంతో ఎదునూరి కర్ణాకర్ తోపాటు ఒకరికి తీవ్రగాయాలు కాగా మరో వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. ఇట్టి విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

వన మహోత్సవానికి ఏర్పాట్లు

- నర్సరీల్లో పండ్లు, పూలమొక్కల పెంపకం
- మండలంలో 1.70 లక్షల మొక్కల పెంపకమే లక్ష్యం



చిన్నపెండ్యాలలోని నర్సరీ

చిల్పూరు: వన మహోత్సవానికి గ్రామాల్లో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నర్సరీల్లో వర్షాలు పడగానే మొక్కలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. మొక్కలు నాటేందుకు ఇప్పటికే ఎక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా అధికారులు తెలుసుకుంటున్నారు.

17 నర్సరీల ఏర్పాటు

మండలంలో 17 గ్రామ పంచాయతీలుండగా అన్ని గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. వేసవి ప్రారంభంలోనే లక్ష్యాలను గుర్తించి నర్సరీల్లో బెడ్లు ఏర్పాటు చేశారు. మండలంలో 1.70 లక్షల మొక్కల పెంపకమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టారు. విత్తనాలు నాటడం, నీరు పెట్టడం, బ్యాగ్ ఫిల్లింగ్‌తో పాటు ఎండ నుంచి మొక్కలను రక్షించేందుకు గ్రీన్ షెడ్లు ఏర్పాటు చేశారు.

పండ్లు, పూల మొక్కల పెంపకం

మండలంలో నర్సరీల్లో గ్రామ విస్తీర్ణం, జనాభా ఆధారంగా మొక్కల పెంపకం సామర్థాలను నిర్ధారించారు. ఒక్కో నర్సరీల్లో 10 నుంచి 30 వేల మొక్కలు పెంచుతున్నారు. ఇళ్లలో నాటేందుకు పండ్లు, పూల మొక్కలు సిద్ధం చేస్తున్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్, ప్రకృతి వనాల కోసం మరిన్ని రకాల విత్తనాలను నాటినట్లు అధికారులు తెలిపారు.

షేడ్ నెట్‌తో సంరక్షణ..

వేసవిలో ఎండలు అధికంగా ఉండడంతో నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. షెడ్ నెట్‌లు ఏర్పాటు చేసి మొక్కలకు ఎండ తగలకుండా చేయడంతో పాటు ఉపాధి హామీ కూలీలతో నిత్యం నీటిని అందిచడంతో ఈసారి ప్రతీ మొక్క ఎండిపోకుండా కాపాడగలిగారు. నర్సరీల నిర్వహణ మొత్తం పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు.

నాటిన ప్రతీ మొక్క కాపాడేలా ఏర్పాట్లు

త్వరలో ఏర్పాటు చేసే వనమహోత్సవంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను కాపాడేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి



ఈసారి ప్రభుత్వం చేపట్టే వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి. ఆలయ పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటుతాం. అందరు సహకరించాలి.

– పి. శ్రీధర్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్

అందరితో మొక్కలు నాటిస్తాం



ఈ ఏడాది వనమహోత్సవం కార్యక్రమంలో చిల్పూరు ఆలయ ధర్మకర్తలుగా ప్రతీ ఒక్కరితో మొక్కలు నాటిస్తాం. ఖాళీ స్థలాల్లో బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.

– చల్లా వెంకటరమణాదేవి, ధర్మకర్త

లక్ష్యం మేరకు మొక్కల పెంపకం



ప్రతీ గ్రామంలోని నర్సరీల్లో లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను పెంచాం. ఈసారి ఎండలు ఎక్కువగా ఉన్నా వడ గాలులకు ఎండి పోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో ఒక్కమొక్క ఎండి పోలేదు. వనమహోత్సవం నాటికి గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి మొక్కలు నాటడం పై అవగాహన కల్పిస్తాం.

– బర్మావత్ శంకర్‌నాయక్, ఎంపీడీఓ

మూడున్నరేళ్లు మిగిలి ఉంది

- ప్రజల కోసం ప్రధానిని ఎన్నిసార్లు అయినా కలుస్తాం
- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ చామల, పక్కన డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, యువ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి

జనగామ: రాష్ట్రంలో ప్రజలు ఇచ్చిన అవకాశానికి ఐదేళ్ల పాలన పరీక్షల్లో పాస్ అయ్యేందుకు మరో మూడున్నరేళ్లు మిగిలి ఉందని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డితో కలిసి గురువారం నియోజకవర్గంలోని 245 మందికి రూ.2.23 కోట్ల మేర సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంపీ పంపిణీ చేశారు. మూడున్నర సంవత్సరాల కాలంలో ప్రజలకు మరింత దగ్గరయ్యే విధంగా ముందుకు వెళ్తామన్నారు. కేసీఆర్ హయాంలో ప్రధాన మంత్రిని లెక్క చేయకుండా అహంకార పూరితంగా వ్యవహరించారని, తెలంగాణ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ పీఎం, కేంద్ర మంత్రులను కలుస్తూ నిధులను తీసుకు వచ్చే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఇందుకు కోసం 40 సార్లు కాదు, వంద సార్లు అయినా ఢిల్లీకి వెళ్తామన్నారు. త్రిపుల్‌ఆర్‌తో జనగామ రూపు రేఖలు మారనున్నాయన్నారు.

దయ్యాలు ఎవరో కవితే చెప్పాలి

బీఆర్‌ఎస్ పార్టీలో దయ్యాలు ఎవరో కల్వకుంట్ల కవితనే చెప్పాలని ఎంపీ డిమాండ్ చేశారు. పంపకాల్లో తేడా వచ్చిందా, కుటుంబంలో కల్లోలం జరిగిందా తెలయదు కానీ, కవిత తండ్రి కేసీఆర్‌కు రహస్యంగా రాసిన లేఖ బయటకు రావడం కొంత మంది దయ్యాలు అనడం హాస్యాస్పదమన్నారు. వారి పేరు ఎందుకు చెప్పడం లేదో ప్రజలు గమనించాలన్నారు. కవితకు చిత్త శుద్ధి ఉంటే త న లేఖను బహిర్గతం చేసిన వారి పేర్లతో ఫిర్యాదు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నాయకులు, 8 మండలాల కేడర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామారావు

తరిగొప్పుల: ప్రభుత్వ పథకాల అమలులో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మందాడపు రామారావు అన్నారు. మండల ప్రత్యేక అధికారి రాణా ప్రతాప్ సింగ్ అధ్యక్షతన గురువారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, భూ భారతిపై అవగాహన, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన చర్యలు, బడిబాట, ఆరోగ్య శిబిరాలు, రాజీవ్ యువవికాసం పథకంపై సమీక్ష నిర్వహించారు. ఉపాధిహామీ కూలీల వేజ్ పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఎంపీఓ మాలతి, ఏఎస్సై రాజయ్య, ఏపీఎం రమాదేవి, ఏఓ మనోహిత్ విక్రమ రావు,ఎంఈఓ జానకి, ఆర్‌ఐ ఆంధ్రయ్య,ఏఈఓలు పాల్గొన్నారు.

వచ్చే మూడేళ్లలో హామీలన్నీ నెరవేరుస్తాం..



సబ్‌స్టేషన్ శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్: వచ్చే మూడేళ్లలో ఇచ్చిన ప్రతీ హామీని నెరువేరుస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. మండలంలోని సాగరం గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ శిలాఫలాకాన్ని ఎమ్మెల్యే గురువారం ఆవిష్కరించడంతో పాటు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా సన్న బియ్యం, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, వంటి పథకాలను అమలు చేయడం జరుగుతున్నదన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి విద్యుత్ సమస్య ఉండకూడదనే ఉద్దేశంతో సుమారు రూ. 35 కోట్లతో సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్యశిరీష్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, విద్యుత్ ఎస్‌ఈ వేణుమాధవ్, డీఈలు రాంబాబు, విజయ్‌కుమార్, తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీఓ సుమన్, ఏడీలు రణధీర్‌రెడ్డి, హుస్సేన్, ఏఈలు విశ్వసాయితి, రమేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

స్టేషన్‌ఘన్‌పూర్: నమిలిగొండ గ్రామ అభివృద్ధికి ప్రత్యేక చొరవతో పనిచేస్తానని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. నమిలిగొండ గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవమైన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు రెండు రోజులుగా జరుగుతుండగా గురువారం నిర్వహించిన అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, బోనాల పండుగకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. పురోహితులు పాలకుర్తి శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు గౌతమ్‌శర్మ, కిషోర్‌శర్మ వేదమంత్రాల మధ్య ఘనంగా పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోల రాజయ్య, ఉపాధ్యక్షుడు నీల రాజయ్య, కోశాధికారి చిక్కుడు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పురమాని రజాక్‌యాదవ్, ముదిరాజ్ సంఘం బాధ్యులు చిక్కుడు సమ్మయ్య, కోల పెద్ద సోమయ్య, పెండెల వెంకటయ్య, కోల కుమార్, నీల సోమయ్య, గుండె నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొన్న వెంటనే మిల్లులకు తరలించాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

రఘునాథపల్లి/నర్మెట: కేంద్రాల్లో ధాన్యం కొన్న వెంటనే జాప్యం చేయకుండా బస్తాలను వెంట వెంటనే మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ నిర్వాహకులను ఆదేశించారు. గురువారం రఘునాథపల్లి మండలంలోని వెల్ది, అశ్వరావుపల్లి, జాఫర్‌గూడెం, ఖిలాషాపూర్, నర్మెట మండలంలోని వెల్దండ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేసి ఎపీఎంఎస్‌లో ఎప్పటికప్పుడు వివరాలను సక్రమంగా నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేయగా తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం, తూకం వేసిన బస్తాలు, కొనుగోళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట తహసీల్దార్లు మోహిన్ ముజ్జబ, కలకుంట్ల వెంకటరామానుజాచార్యులు, ఏపీఎంలు సారయ్య, మాదారపు రవి, డీఎం హరినాయక్, డీటీలు శ్రీనివాస్, దేవానాయక్, సీఎస్ ఇట్టబోయిన శ్రీనివాస్, ఎమ్మార్ఐ సింగారపు సాయిబాబా ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

లింగాలఘణపురం: బడీడు పిల్లలందరిని గ్రామంలో ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ విష్ణుమూర్తి కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బడిబాటపై అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాలు ఉంటాయని, 6న ప్రతి గ్రామంలో గ్రామసభ, ర్యాలీ నిర్వహించాలని ఇందులో సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు సభ్యులు, ఏఏపీసీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థులంతా పాల్గొనే విధంగా చూడాలని, 7న ఇల్లిల్లూ తిరిగి బడిఈడు పిల్లలను గుర్తించాలని, 8నుంచి 10 వరకు గుర్తించి పిల్లలను బడిలో చేర్పించాలని, 11న మరోసారి సమీక్షించుకొని 12 నుంచి 19 వరకు రోజువారి కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎంపీఓ రఘురామకృష్ణ, ఏపీఎం శంకరయ్య, డాక్టర్ స్వర్ణలత, పోలీసుశాఖ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సాగులో మెళకువలు పాటించాలి

దేవరుప్పుల: సాగులో రైతులు మెళకువలు పాటించాలని మండల వ్యవసాయ అధికారిణి బజ్జూరి దివ్య సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వర్షాకాలం సాగు, విత్తనాల కొనుగోళ్లు, వినియోగంపై ఆమె రైతులకు అవగాహన కల్పించారు. సదస్సులో వ్యవసాయ విస్తీర్ణాధికారి సూదగాని సాగర్, ఆదర్శ రైతులు ఈదునూరి రామచంద్రారెడ్డి, రుద్రోజు వీరన్న, కంసాని ఉపేందర్‌రెడ్డి, పట్టాభిరామిరెడ్డి, వెంకట్‌రెడ్డి,అశోక్ రెడ్డి, మహిళ రైతులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

పాలకుర్తి టౌన్: కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరను పెంచడతో గురువారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపాటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యాక్షుడు మహేందర్ , మారం రవికుమార్, కమ్మగాని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు,

గిరిజనులు రాజకీయంగా ఎదగాలి

దేవరుప్పుల: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గిరిజనులు రాజకీయంగా ఎదుగాలని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్, మాజీ జెడ్పీచైర్‌పర్సన్ ధన్వంతి సూచించారు. గురువారం ఓ కార్యక్రమంలో వారిద్దరిని మర్యాదపూర్వంగా కలిసి కాంగ్రెస్ గిరిజన నాయకులు సన్మానించారు.

'రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం'



మాట్లాడుతున్న చందునాయక్

జనగామ రూరల్: రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వానికి రాబోయో కాలంలో తగిన గుణపాఠం తప్పదని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ పేర్కొన్నారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారుసుల ఆధారంగా ధరలు నిర్ణయించకుండా మనుధర్మ శాస్త్రం అమలు చేసి రైతుల నడ్డి విరిచే చర్యలకు దిగడం సరికాదన్నారు. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధాలకు నిరసనగా జూన్ 11వ తేదీన అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మాచర్ల సారయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

'అవకతవకలకు పాల్పడితే చర్యలు'



మాట్లాడుతున్న వెంకటరామానుజా చార్యులు

నర్మెట: రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్ప డితే చర్యలు తప్పవని తహసీల్దార్ కలకుంట్ల వెంకట రామానుజా చార్యులు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం జూన్, జులై, అగస్టు మూడు నెలల సన్న బియ్యం ఒకేసారి అందిస్తున్నదని డీలర్లు జూన్ 30లోగా ఒకేసారి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ వేణు, సీనియర్ అసిస్టెంట్ యాదయ్య, ఎమ్మార్ఐ సాయిబాబ, సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

తరిగొప్పుల: రేషన్ డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ మందాడపు రామారావు సూచించారు. వర్షాకాలం దృష్ట్యా ప్రభుత్వం జూన్, జులై, ఆగస్టు మూడు నెలలకు కలిపి జూన్ నెలలో రేషన్ బియ్యం పంపిణీ చేయనున్న నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. రేషన్ డీలర్లు ప్రజా పంపిణీ దుకాణాల్లో లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఆర్‌ఐ ఆంధ్రయ్య,రెవెన్యూ సిబ్బంది,రేషన్ డీలర్లు సామెలు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

లూజ్ విత్తనాలు అమ్మితే చర్యలు

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో లూజ్ విత్తనాలను విక్రయిస్తే వారిపై సీడ్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఫణికిషోర్, మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డిలు అన్నారు. గురువారం టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు మండల కేంద్రంలోని ఆగ్రోస్ సేవా కేంద్రం, శివశంకర్ ఫర్టిలైజర్, ఎస్వీ ఆగ్రిమాల్, మన గ్రోమోర్ కేంద్రాలలో తనిఖీలను చేసి రికార్డులను పరిశీలించారు.

కూలిన ఇల్లు.. బాలుడికి గాయాలు

రఘునాథపల్లి: లక్ష్మీతండాలో రేకుల ఇల్లు కూలి ఓ బాలుడు స్వల్పంగా గాయపడిన సంఘటన గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. తండాకు చెందిన నెతావత్ రాజు–సునిత దంపతుల పెంకుటిల్లు శిథిలం కావడంతో రేకులు కప్పుకొని జీవనం కొనసాగిస్తున్నారు. తల్లిదండ్రులు కుమారులు ఈశ్వర్, దేవేందర్‌లతో కలిసి రాత్రి నిద్రపోయాక ఈదురు గాలులకు రేకులు కూలి ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. దీంతో బాలుడు ఈశ్వర్ మోకాలికి, కింద బాగాన మట్టి పెల్లలు పడటంతో గాయాలయ్యాయి. రాజు మేల్కొని వెంటనే భార్య, పిల్లలతో ఇంట్లో నుంచి బయట పడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి బాధితుడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పేదల పక్షపాతి సీఎం

బచ్చన్నపేట: సీఎం రేవంత్‌రెడ్డి నిరుపేదల పక్షపాతి అని కట్కూర్, వీఎస్ఆర్‌నగర్ గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పుట్ట నర్సింహులు, సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం గ్రామంలో పలువురు లబ్దీదారులకు మంజూరు అయిన సీఎం ఆర్‌ఎస్ చెక్కులను వారు పంపిణీ చేశారు.

సన్మానం

కొడకండ్ల: ఇచ్చిన మాటకు కట్టుబడి వెనుకబడిన కొడకండ్లలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేయించిన ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలకు మండల ప్రజల పక్షాన రుణపడి ఉంటామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. గురువారం రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేయించినందుకు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్‌లను ఆయన కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

బొడ్రాయికి జలాభిషేకం

చిల్పూరు: వెంకటాద్రిపేటలో గురువారం బొడ్రాయి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్రాయికి మహిళలు జలాభిషేకం నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ అర్చకులు రాజేశ్వరశర్మ వేద మంత్రాల నడుమ బొడ్రాయికి పూజలు నిర్వహించారు. సాయంత్రం బోనాలు సమర్పించారు.

పశువులను అక్రమ రవాణా చేస్తే చర్యలు

లింగాలఘణపురం: పశువులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ శ్రీనివాసు రెడ్డి అన్నారు. గురువారం కుందారం క్రాస్ రోడ్డు చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న రెండు గేదెలు, ఏడు దున్నపోతులను పట్టుకుని గోశాలకు తరలించినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె, దూడ మృతి

పాలకుర్తి టౌన్: మంచుప్పుల గ్రామానికి చెందిన రైతు బుడిగే మల్లేష్‌కు చెందిన పాడి గేదె, దూడ గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందాయి. బుధవారం రాత్రి కురిసిన గాలివానకు విద్యుత్ స్తంభం విరిగి తీగలు నేలవాలాయి, ఆ ప్రాంతానికి మేతకు వెళ్లిన పాడిగేదె, దూడకు తీగలు తాకడంతో విద్యుదాఘాతంతో మృతి చెందాయి. తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోండి

దేవరుప్పుల: ఈ నెల 3 నుంచి 19వ తేదీ వరకు అపరిష్కృత భూసమస్యల పరిష్కారం కోసం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కొనసాగే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఆడెపు అండాలు సూచించారు.

31న 'చలో వరంగల్'

రఘునాథపల్లి: పద్మశ్రీ అవార్డు తీసుకుని ఈనెల 31వ తేదీన ఢిల్లీ నుంచి వరంగల్ విచ్చేస్తున్న మంద కృష్ణమాదిగకు స్వాగతం పలికేందుకు చలో వరంగల్‌కు అధిక సంఖ్యలో తరలిరవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలిషా పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ విభాగాల మండల స్థాయి సమావేశం మండల అధ్యక్షుడు సుంచు సురేందర్ అధ్యతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలిషా మాట్లాడారు.

ఘనస్వాగతం పలకాలి

చిల్పూరు: మందకృష్ణ మాదిగకు ఘనస్వాగతం పలకాలని అంబేడ్కర్ యువజనసంఘాల రాష్ట్ర కోఆర్డినేటర్ ఇల్లందుల సుదర్శన్ అన్నారు. చిన్నపెండ్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

రఘునాథపల్లి: సీజనల్ వ్యాధులపై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జరిగిన మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో మండలవైద్యాధికారి స్రవంతి, కోమల్ల వైద్యాధికారి ఇంజమాం, మండల కమ్యూనిటి అధికారి రామ్‌కిషన్, మండల విద్యాశాఖాధికారి రఘునందన్‌రెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు సుజనారజని, సులోచన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా అంతకు ముందు డాక్టర్ స్రవంతి, సీహెచ్‌ఓ రామ్‌కిషన్‌ల ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలకు రాటాసెల్లి వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు.

చరిత్రను వక్రీకరించిన సినిమాకు ఉత్తమ అవార్డు సిగ్గుచేటు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్



సమావేశంలో మాట్లాడుతున్న అబ్బాస్

దేవరుప్పుల : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులను అవమానపరుస్తూ చిత్రీకరించిన రజాకార్ సినిమాకు ఉత్తమ అవార్డు ఇవ్వడం సిగ్గుచేటు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు.గురువారం మండల కేంద్రంలో జనగామ–హైదరాబాద్ సౌత్ జిల్లాల సీపీఎం పార్టీ శ్రేణులకు నాయకత్వ స్థాయి శిక్షణ తరగతుల ముగింపు సమావేశానికి ప్రిన్సిపాల్‌గా సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి వ్యవహరించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నాడు సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిందన్నారు. భూస్వామ్య, జమీందారు, జాగిర్దారి వ్యవస్థకు వ్యతిరేకంగా పేదలకు భూమి పంచాలనే నినాదంతో సాగిన పోరాటాన్ని హిందువులకు ముస్లింలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా సినిమా రూపంలో వక్రీకరించారని ధ్వజమెత్తారు. శిక్షణ తరగతుల్లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు, సింగారపు రమేష్, సౌత్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వర్, ఇర్రి అహల్య, రాపర్తి సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సజ్జ మొక్క @ 25 కంకులు



25 కంకులు వేసిన సజ్జ మొక్క

పాలకుర్తి: సాధారణంగా సజ్జ మొక్క ఒకటి లేదా రెండు కంకులు వేయడం అరుదు. కానీ పాలకుర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తా నుంచి గుడివాడ చౌరస్తా మధ్య ఓ చికెన్ సెంటర్ వద్ద సజ్జ మొక్క ఏపుగా పెరిగి ఏకంగా 25 కంకులు వేయగా.. అటుగా వెళ్లిన వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు. మండలంలో 46వేల ఎకరాల భూమి ఉండగా.. ఇక్కడి రైతులు సజ్జ పంటను సాగు చేయడం లేదు. కాగా సాగు చేస్తే మంచి దిగుబడితో లాభాలు ఆశించవచ్చు. ఈమేరకు సజ్జ పంట వేయాలని రైతులను ప్రోత్సహిస్తామని ఏఓ శరత్ చంద్ర తెలిపారు.